# కవిత్వంలో 'తల్లి'వేరు

- ఎమ్వీ రామిరెడ్డి

కవిత్వ ప్రవాహం అనేక ఉద్యమపాయల సంగమం. కాలాన్ని వెంబడిస్తూ కొన్ని సందర్భాలు సృజనకారుల్ని చుట్టుముడుతుంటాయి. సమయపు చిటికెన వేలు పుచ్చుకుని కవులు ఆయా సందర్భాలకు అక్షరాలు తొడుగుతుంటారు. కవిని బట్టి, భావతీవ్రతను బట్టి, తొడుగును బట్టి సంబంధిత ఉద్యమగీతం వెలుగులీనుతుంటుంది. 1970లలో విప్లవ సాహిత్యోద్యమం, 80లలో స్త్రీవాద కవిత్వం, 90లలో దళిత, ముస్లిం వాదాలు ఉధృతంగా ఎగసిపడ్డాయి.

ఎన్ని ఉద్యమాల తుపాన్లు వచ్చినా, ప్రత్యేక భావజాలాల అగ్నిశిఖలు మండినా... ఉద్యమేతర కవిత్వం ఎప్పుడూ ఉనికిని కోల్పోలేదు. ప్రధానంగా మానవతావాదమే ఇరుసుగా ప్రయాణం సాగించింది. కొన్ని ఇత్తివృత్తాలుంటాయి. అవి ఎప్పటికీ నిర్జీవం కావు. వాటిల్లో నిస్సందేహంగా అగ్రభాగాన నిలిచేది 'అమ్మ'. భావకవి మొదలు విప్లవకవి దాకా, యువకవి మొదలు పండితశ్రేష్ఠుల దాకా అమ్మ మీద పద్యాలు అల్లనివారు ఉండరంటే అతిశయోక్తి కాదు. పద్యం, పాట, కవిత, వచనం, గేయం... ఇలా ఏ ప్రక్రియలో ప్రవేశం ఉన్న సృజనకారులైనా 'అమ్మ'ను తృణీకరించడం అసాధ్యం.

అమ్మంటే తొలి పొద్దు. తొలి నేస్తం. తొలి గురువు.

అమ్మంటే లాలన, దీవెన, ప్రేమ, ఆత్మీయ భావన. ఇన్ని భావనల సమ్మేళనం మరే వ్యక్తిలోనూ కనిపించవు. కాబట్టే ఎన్ని వాదాలు ఎలమీదికి వచ్చినా అమ్మ ప్రేమ అడుగంటలేదు. ప్రధానంగా కవిత్వంలో అమ్మపై అద్భుతమైన కవితలు వెలువడ్డాయి. ఒకే ఇతివృత్తం మీద వచ్చిన చాలా రకాల కవితలు పరస్పరం సంఘర్షించుకుని, తమ రూపలావణ్యాలను కోల్పోయినప్పటికీ, అమ్మపై వచ్చిన కవితలు మాత్రం ఆ బాట పట్టలేదు. ఎంతో వైవిధ్యంతో భిన్న ఊహల నిర్మాణంతో కవులు అమ్మకు కవితా సత్కారం నిర్వహించారు. శ్రీనాథుడు తన కావ్యం 'భీమఖండం'లోని 'గుణనిధి వృత్తాంతం'లో అమ్మను ఇలా వర్ణిస్తాడు...

**అరుణగభస్తిబింబ ముదయాద్రిపై బొడతేర గన్నెలో**
**పెరుగును వంటకంబు వడపిందెలు గుడువంగబెట్టు**
**నిర్భర కరుణాధురీణ ప్రాణము ప్రాణము తల్లియున్నదే**
**హరహర! ఎవ్వరింక కడుపారసి తీర్చెదరీప్సితార్థముల్**

అమ్మ పలకరింపును మించిన అనుబంధం లేదు. తల్లి చనుబాలను మించిన అమృతం లేదు. **'దేశం ఏదైనా మట్టంతా ఒక్కటే, అమ్మ ఎవరైనా చనుబాలు తీపి ఒక్కటే'** అంటాడు చెరబండ రాజు.

అమ్మనూ శ్రమనూ వేరుచేసి చూడలేం. ఆమె ప్రతి అడుగులోనూ స్వేదం చిందుతుంది. **తెల్లవారక ముందే నిద్ర లేచి, నుదుట సూర్యోదయంతో సుప్రభాత గీతమయ్యే** (బీరం సుందరరావు) అమ్మ రోజంతా పనుల సముద్రాన్ని ఈదుతూనే ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లోని 'అమ్మ' కోడికూత కంటే ముందుగా లేస్తుంది. చకచకా ఇంటిపని పూర్తి చేస్తుంది. పిల్లల్ని బడికి పంపిస్తుంది. తాను పొలం పనులకు బయల్దేరుతుంది.

**పొద్దుతో పాటు**
**పంటపొలంలో పొడిచేది అమ్మ**
**మొగ్గలకు రెక్కలతికిన అమ్మ**
**వల్లనల్లని రేగళ్ల నాగేటి చాలయ్యింది** అంటాడు అల్లం నారాయణ. ఆమెకు ఇంటిపనుల చాకిరీ ఎప్పుడూ తప్పదు. కారం దంచుతున్నప్పుడు, కట్టెలు కొడుతున్నప్పుడు అమ్మగాజులు పత్తిగింజల్లా పగులుతుంటాయి.

**పగిలిన గాజుముక్కల్ని ప్రేమగా ఏరుకుని**
**దీపం సెగలో ముక్కల్ని జతచేస్తూ**
**రంగురంగుల గాజు గొలుసులు చేసి ఆడుకోవడం**
**చిన్నప్పుడు సరదాగా ఉండేది** అంటూ ఎండ్లూరి సుధాకర్ తన చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటాడు. అంతలోనే తండ్రి మరణం గుర్తొచ్చి అతని హృదయం బరువెక్కుతుంది. తండ్రితో తల్లి జీవితం ఎలా ముడిపడి ఉందో తలచుకుంటాడు.

**చివరిసారి నాన్న సమాధి ముందు**
**అమ్మ గాజుల్ని నా కళ్లముందే పగలగొడుతున్నప్పుడు**
**సగం ఆకాశం ముక్కలై విరిగి పడుతున్న చప్పుడు** ఇప్పటికీ కర్ణకఠోరంగా అతని గుండెల్లో మార్మోగుతూనే ఉంటుంది. జీవనయానంలో ఎన్ని మజిలీలు దాటినా అప్పటి జ్ఞాపకాల గాజుల గలగల వినిపిస్తూనే ఉంటుంది.

తొమ్మిది నెలలపాటు బిడ్డను కడుపులో మోయటంలో అలౌకికానందం పొందుతుంది తల్లి. దాన్నో ప్రహసనంగానో భారంగానో భావించదు. బిడ్డ పుట్టి ఎదుగుతున్న కొద్దీ ఆమె జీవితంలో తన్మయత్వపు అధ్యాయాలు ఆరంభమవుతాయి. పసికందే ప్రాణంగా మారుతుంది. బిడ్డకేమాత్రం నొప్పి తగిలినా విలవిలలాడిపోతుంది.

**నా బుడిబుడి అడుగుల చేయూతవై**
**నాకో ఉనికిని ఇచ్చింది దేనికమ్మా?**
**నా ఒంటిమీద చిన్న గాయమైతే**
**నీ కళ్లల్లో నీళ్లెందుకూరుతున్నాయి తల్లీ?** అని కొడూరి విజయ్‌కుమార్ తనను తాను ప్రశ్నించుకుంటాడు. ఈ తన్మయత్వంలోంచే కవి కృతజ్ఞతా కుసుమాలను వెలికితీసి, అమ్మకు అక్షరాభిషేకం చేస్తాడు.

**వేలు పట్టుకుని నడక నేర్పిన తల్లి నా కవిత్వం**
**తాను తినక అమ్మ నాకు దాచిన అన్నం ముద్ద నా కవిత్వం** అని పెమ్మరాజు గోపాలకృష్ణ స్మరించుకుంటాడు.

**ఆమె నాకు ఒట్టి అన్నమే పెట్టి ఉంటే**
**అది దొరకని నాడే నేను చనిపోయి ఉండేవాణ్ని**
**ఆమె నాకు ఒట్టి అక్షరాలే నేర్పించి ఉంటే**
**వాటికింత కన్నీటి వాసనే ఉండేది కాదు** అంటూ ఆగని కన్నీటి తడి నడుమ చీకోలు సుందరయ్య తన మూలాల్ని వెతుక్కొనే ప్రయత్నం చేస్తాడు.

-------

పున్నమి రాత్రి ఆరుబయట పడుకుని చూపుల్ని ఆకాశంలోకి విసిరేస్తే... ఆ ఊహే అద్భుతం! అప్పుడు కనిపించే నిండైన చంద్రుడి రూపం మహాద్భుతం. ఆ బింబంలో కనిపించే ఆకృతులు మరింత అద్భుతం. ఇన్ని అద్భుతాలు చంద్రుడి సొంతమవడానికి కారణం అమ్మేనంటాడు డాక్టర్ సి.నారాయణరెడ్డి. ఎలాగంటే...

**ఆరుబయట వెన్నెల్లో నన్ను జోకొడుతున్నప్పుడు**
**అమ్మ ఫోటో తీసి ఉంటాడు చందమామ**
**అతను దాచుకుంది అమ్మ బొమ్మేనేమో!**

ఆదివారం వస్తే అందరికీ సెలవే, అమ్మకు తప్ప! ఆరోజు ఇంట్లో వాళ్లంతా స్వేచ్ఛాయుతంగా ప్రణాళికలు రచించుకుంటారు. సరదాగా గడిపేందుకు సిద్ధమవుతారు. సమయానికి వారికి అన్నీ అమరితేనే వారి ప్రణాళికలు సజావుగా అమలవుతాయి. **ఆదివారాన్ని మనమంతా సినిమాలుగా, షికార్లుగా, ఛీర్స్‌గా కొరుక్కు తింటుండగా అమ్మ మాత్రం కాఫీలై, టిఫిన్లై, టాటాలై మిగిలిపోతుంది.** ఆమెకూ ఆటవిడుపు అవసరమన్న విషయాన్ని డి.గణేష్‌బాబు పసిగట్టి కవిత్వంలో ఇమిడ్చాడు.

**అవును, అమ్మను గుర్తించలేం**
**మనం టీవీ ముందు క్రికెట్ మ్యాచై, కేరింతలమైనప్పుడు**
**చల్లని పానీయాలుగా మన మధ్యకు ప్రవహించే అమ్మను మనం గుర్తించలేం**
**పిలిస్తే జలపాతమై దూకే అమ్మలో మనం అలసట హోరు వినలేం**
**అమ్మకు ఆదివారం లేదు**

క్రమేపీ అమ్మ గాయపడుతూంటుంది. గాయాలు పెద్దవవుతుంటాయి. అవేమీ పట్టించుకోదామె. కాళ్ల కింద ముళ్లు నలుగుతున్నా ఖాతరు చేయదు. తన లక్ష్యమేదో తనకున్నట్లు ముందుకు సాగిపోతుంది.

**అమ్మ**
**పగిలిన పడవ మీద చిరిగిన తెరచాపై ప్రయాణించింది**
**మృత్యువును కొప్పులో ముడుచుకుని నడిచింది**
**నాకు గాయాల్లో పోరాడ్డం నేర్పింది**
**అమ్మను చూసినప్పుడల్లా నాకు యుద్ధభూమి గుర్తుకొస్తుంది**
**అమ్మా! నీ కన్నీళ్లకు నమస్కరిస్తున్నాను** అంటాడు ఆశారాజు.

పీకల్లోతు పేదరికంలో కూరుకుపోయిన తన తండ్రి... బతుకురథాన్ని లాగేందుకు కండలు కరిగిస్తాడు. ఊరంతా హీనంగా చూస్తున్నా పట్టెడు మెతుకుల కోసం ఊళ్లో అందరికీ సేవలు చేస్తాడు. సేవకుడి భార్యగా తన తల్లి పరిస్థితి మరింత చిత్రంగా హీనంగా మారిన విషయాన్ని ప్రతిభావంతంగా కవిత్వీకరిస్తాడు కోయి కోటేశ్వరరావు.

**ఊరందరికీ మా అయ్య బానిసైతే**
**పాపం అమ్మ, అయ్యక్కూడా బానిస**
**బానిసకే బానిసైన అమ్మ బతుకులోకి ఫారజూస్తే**
**లెక్కలేనన్ని వాయుగుండాలు**

-------

పిల్లలు పెరిగి పెద్దవారయ్యారు. ప్రయోజకులయ్యారు. అమ్మ మొహం నిండా ఆనందం. గుండెల్నిండా సంబరం. ఇంటికి కోడళ్లు వచ్చారు. మరి అప్పుడైనా ఆమెకు విశ్రాంతి దొరికిందా?

రక్తం ముద్దకు ప్రాణం పోసి, ముద్దుమురిపాల గోరుముద్దలు తినిపించి, జీవితాన్నిచ్చిన అమ్మకివాళ విషం పంచుతున్నదెవరు?

**ఎన్నెన్ని సేవల్జేసిందమ్మ**
**ఏ సేవలకూ నోచుకోకుండానే...**
**నిన్నటిదాకా అమ్మకొంగు చుట్టూ తిరిగిన పిల్లలే**
**ఇవ్వాళ పెళ్లాల అయస్కాంత క్షేత్రంలో-**
**అమ్మంటే అవసరానికి పనికొచ్చే**
**ప్రామిసరీ నోటైపోయిందా!?** (కత్తుల కిషోర్‌కుమార్).

చూస్తుండగానే అమ్మ చుట్టూ కత్తులు మొలుచుకొస్తాయి. తనకంటూ ఉన్న ప్రత్యేక ప్రపంచాన్ని ఆమె కోల్పోతుంది. పనిలో పుట్టి, పనిలో పెరిగి, పనిలోనే బతకాల్సిన దుర్భర స్థితిలో కూరుకుపోతుంది.

**ఇపుడు అమ్మ చుట్టూ ఆంక్షల సంకెళ్లు**
**వంటింటికి జీవితాన్ని అంకితమిచ్చిన వేళ,**
**పొగబారిన అమ్మ కళ్ల ఆధివాస్తవిక రూపాలు**
**నాలుగు గోడల మధ్య సజీవసమాధి అయినపుడు**
**అమ్మ కళ్ల నిశ్శబ్ద జలపాతాలు** (మహెజబీన్) అవుతాయి.

అమ్మ రక్తాన్ని పీల్చిపిప్పి చేసి, ఆమె ఆశల్నీ కలల్నీ దహించివేసిన వంటింటిపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తుంది విమల. ఇలాంటి సంస్కృతినీ గరిటె తిప్పడాలనూ ధ్వంసం చేద్దామని పిలుపునిస్తుంది.

**అసలు మా అమ్మే నడుస్తున్న వంటగదిలా ఉంటుంది**
**ఏడ్చీ ఏడ్చీ ఆమె కళ్లు ఎక్కడో కారిపోయాయి**
**తోమీ తోమీ ఆమె చేతులు అరిగిపోయాయి**
**మా అమ్మకి చేతులు లేవు-**
**ఈ వంటింటి సామ్రాజ్యానికి మా అమ్మే రాణి**
**అయినా, వంటింటి గిన్నెలన్నిటిపైనా మా నాన్న పేరే!**

ముస్లిముల ఇళ్లల్లోనూ అమ్మలు ఇందుకు భిన్నంగా లేరు. వాళ్లు పెనం మీద రొటీలు. పిల్లల్ని కనే యంత్రాలు. ముఖాలకు బురఖా శృంఖలాలు. నిబంధనల సంకెళ్లు. రంగులలోకపు సౌందర్యానికి నోచుకోని మబ్బుపట్టిన జీవితాలు. ఈ పరిస్థితుల్ని ఖాజా అక్షరబద్ధం చేశాడు.

**అమ్మా!**
**నువ్వూ రంగురంగుల చీరలు కట్టుకుని షాదీ సంబరానికెళితే చూడాలనుందే**
**ఎర్రెర్రని పచ్చపచ్చటి చెమ్కీ చీరల్లో**
**నాగుల్‌మీరా మొగలాలి జెండాల్లా నడుస్తుంటే చూడాలనుందమ్మా**
**ఎప్పటికైనా నీ దుఃఖాన్ని రాయాలనీ**
**నీ మబ్బుపట్టిన జీవితాన్ని చిత్రించాలనీ**
**నీ మింగుడు పడని మెంతుల మధుమేహ వ్యాధికి**
**మందు కనుక్కోవాలని ఉందమ్మా!**

-------

ఇన్ని బడబాగ్నుల మధ్య కమిలిపోతున్నా మనిషికి నిజమైన కర్తవ్యాన్ని బోధించగల విశ్వరూపం 'అమ్మ'లోనే దాగి ఉంది. ఆమె పిల్లలకు మంచితనం ఆవశ్యకతను నేర్పిస్తుంది. అన్యాయాలనెదిరించే ధైర్యాన్ని నూరిపోస్తుంది. ఉద్యమాల ఉగ్గుపాలు తాపిస్తుంది. ఆ జ్ఞాపకాలను గుండెల్లోకి తెచ్చుకున్న కవి...

**నువు తాపిన షాలలో లేని పిరికితనం**
**నాకెలా వచ్చిందో అర్థం కాదు**
**అమ్మా!**
**నోటిమాట చేతిరాత**
**ఇవ్వాళ నీకు వాగ్దానం కాబోదు** (ఆర్.కె.) అంటాడు. వాగ్దానభంగం కాకుండా ఉండాలంటే బతుకు సంకెలను బద్దలు కొట్టడమే మార్గమంటాడు. ఈ నేపథ్యంలో రామాయణంలోని మౌలిక విషయాన్ని చాకచక్యంగా కవిత్వీకరించడం కవి నైపుణ్యానికి ప్రతీక.

**పితృవాక్య పరిపాలన వల్ల**
**హింసకు ప్రతీక అయిన రామచరిత్ర**
**తల్లి హృదయం లేకే ఆరాచయమయ్యింది**

**తల్లంటే ఆకాశం, అమృతం, ఎక్కుపెట్టిన విల్లు** అంటూ కత్తి పద్మారావు అమ్మ గొప్పతనాన్ని కొత్త కోణంలో ఆవిష్కరిస్తాడు.

**రూపాయి కంటే చిన్నదైనా**
**దేశం కన్నా మా అమ్మ పెద్దదే!** (నాళేశ్వరం శంకరం) అనీ,
**భూగోళానికున్న ఒకే ఒక్క జీవలక్షణం అమ్మల్ని కనడం**
**అమ్మలకున్న ఒకే ఒక్క జీవలక్షణం భూగోళానికి అమ్మతనాన్ని నేర్పడం** (పైడి తెరేష్‌బాబు) అనీ అమ్మ యొక్క విశ్వజనీనతను వైవిధ్యభరితంగా చాటిచెప్పడం కవిత్వం చేసుకున్న పుణ్యం.

మరి మనసుల మధ్య విస్తరిస్తున్న కాలుష్య మేఘాల మాటేమిటి?

దానికీ అమ్మే సమాధానం కావాలి. ఎక్కడ మనసులు కలుషితమైపోయాయో అక్కడ అమ్మే కాళిమాత కావాలి. ఎక్కడ అహంకారం హద్దు మీరుతుందో అక్కడ తల్లే మూడో కన్ను తెరవాలి. సమస్త విశ్వానికీ అధినేత అమ్మేననీ ఆమె ఆజ్ఞలే మానవాళి పాటించాల్సిన అసలైన ఉత్తర్వులనీ కె.శివారెడ్డి కుండ బద్దలు కొట్టినట్టు ఇలా చెబుతున్నాడు....

**నా మొత్తం శరీరాన్ని రెండు చేతులుగా మార్చి**
**నమస్కరిస్తున్నాను తల్లీ!**
**సమస్త ప్రపంచాన్నీ నీ అరచేతుల్లోకి తీసుకుని**
**చాచి ఒక్క లెంపకాయ కొట్టు తల్లీ-**
**అఖిల పురుష ప్రపంచాన్ని నీలో**
**తన వికృతపుటాకారాన్ని దర్శించనీ- దర్శించనీ-**